నిజం నిష్ఠూరం



బూర్లె నాగేశ్వరరావు

వజ్రగిరి నగరానికి ఎక్కడినుంచో ఒక బ్రాహ్మణుడు ఉగాది రాబోతూండగా దిగాడు. అతను పెద్ద చదువుకున్న వాడిలాగా లేకపోగా కొంచెం పిచ్చి వాడిలాగా కూడా కనిపించాడు. కాని అతను నలుగురి జాతకాలు చూసి, జరిగినదీ, జరుగుతున్నదీ ఏ మాత్రమూ పొరపాటు లేకుండా చెప్పాడు.

ఇంతలో ఉగాది వచ్చింది. ఆ రోజు సాయంకాలం ఊళ్ళోవాళ్ళు ఊరి దేవాలయంలో పంచాంగ శ్రవణం ఏర్పాటు చేసి, ఆ పనిని బ్రాహ్మడిమీద పెట్టారు.

ఆయన సంవత్సర ఫలితాలు చెబుతూ చిట్టచివరకు, "ఈ సంవత్సరం మొదలుకుని వరసగా మూడు సంవత్సరాలపాటు దేశంలో తీవ్రమైన కాటకం ఏర్పడబోతున్నది. అందుచేత గ్రామస్థులు ధాన్యం నిలువచేసుకుని పొదుపుగా వాడుకోవటం మంచిది," అని హెచ్చరించాడు.

పురాణ శ్రవణానికి వచ్చినవారిలో చాలామంది ఈ హెచ్చరికను లెక్కచెయ్యలేదు. ఆ దేశం సుభిక్షమైన దేశం. ఎన్నో తరాలుగా అక్కడి

ప్రజలు కాటకమన్నది ఎరగరు. కొద్దిమంది ఆ బ్రాహ్మడితో, "మాకు ఏ భయం వచ్చినా కరువు భయం మాత్రం లేదు. చుట్టుపక్కల దేశాలన్నీ క్షామం వాతపడినా మాకు తిండిలోటు ఉండదు. మా గాదెలు ఎప్పుడూ నిండుగా ఉంటాయి," అన్నారు.

బ్రాహ్మడు చేసిన హెచ్చరికను కొద్ది మంది వర్తకులు పట్టించుకున్నారు, కాని వాళ్లు పైకి ఏమీ అనలేదు.

గ్రామస్థులు తన హెచ్చరిక పట్టించుకోకపోయేసరికి, బ్రాహ్మడు తిన్నగా రాజుగారి వద్దకు వెళ్లి మూడేళ్లపాటు దేశం తీవ్రమైన తిండి కరువుకు గురి కాబోతున్నదనీ, కావాలంటే రాజుగారు నక్షత్ర జపాలూ, గ్రహశాంతులూ చేయిస్తే చేయించవచ్చుననీ చెప్పాడు.

పిచ్చివాడిలాగా కనిపించే బ్రాహ్మడి మాటల్లో రాజుకు గురి కుదరలేదు. ఆయన బ్రాహ్మడితో," "తరవాత చూస్తాం. అయినా దేశంలో నాలుగేళ్లకు సరిపడే ధాన్యం నిలువ ఉన్నది. మూడేళ్లు పండకపోయిన అంత బాధ ఉండదనుకుంటాను," అన్నాడు

"మహారాజా, నిలువ ఉన్న ధాన్యం మాయం కావటం కూడా కరువులో ఒక భాగమే. మీ దేశ ప్రజలకు తిండిదగ్గిరా పొదుపు తెలిసినట్టులేదు. వాళ్లను కొంచెం హెచ్చరికగా కూడా ఉండమనండి," అని చెప్పి బ్రాహ్మడు వెళ్లిపోయాడు.

అది మొదలు ఆ బ్రాహ్మణ్ణి చూసిన వాళ్లందరూ ఆయనే క్షామదేవత అన్నట్టు, భయం భయంగా చూడ సాగారు. నిజం నిష్ఠురం అన్నమాట అబద్ధం కాదుగదా!

బ్రాహ్మడు చెప్పినట్టే ఆ యేడు వర్షాలులేవు. ఒక్క రైతు కూడా తన పొలానికి నాగలి కట్టలేదు ధాన్యం వ్యాపారులు మంచి ధర పలికారు. నిలువ చేసుకున్నవాళ్లు తమ అవసరానికి ఉంచుకోగా మిగిలిన ధాన్యం హెచ్చు ధరకు అమ్మేశారు. కరువు రోజుల్లో రొక్కం అవసరమవుతుందని వారికి తెలుసు.

మొత్తంమీద ఆ యేడు దేశంలో ఎవరూ తిండికి ఇరకాటాన పడలేదు.

కాని మరుసటి సంవత్సరం కూడా వర్షాలులేవు. భూమి నెర్రెలు విచ్చి ఎడారిలా అయిపోయింది. కరువు రాక్షసి నోరు తెరిచింది. జనానికి తీవ్రమైన తిండి కొరత ఆరంభమయింది జనం దగ్గిర ఉన్న డబ్బు ఆహార ధాన్యం కొనుగోలుకు ఏ మూలా చాల లేదు. ధాన్యం ధర పాపం పెరిగినట్టు పెరిగిపోయింది. అమ్మితే అట్టెడూ, కొంటే గిద్దెడూ అన్న సామెత అక్షరాలా నిజమయింది.

రాజుకు ఏంచెయ్యటానికీ పాలుపోలేదు. ఆయన ధాన్యపు వర్తకులను

పిలిచి, వారివద్ద ఉంటే అదనపు ధాన్యాన్ని విడుదల చెయ్యమని కోరాడు తమవద్ద ఉండే ధాన్యం తమ కుటుంబాలకే చాలటంలేదని వాళ్లురాజుకువిన్నవించారు. వెంటనే వాళ్లు తమ ధాన్యపు బస్తాలను ఈశ్వరుడైనా కనిపెట్టలేనంత భద్రంగా దాచేసుకున్నారు.

బ్రాహ్మడు మాత్రం ధ్వజమెత్తాడు. ఆయన నగరంలో ఉండే ధాన్య వర్తకు లందరి దగ్గిరికీ వెళ్లి, "మీ దగ్గిర ఎంతెంత ధాన్యం నిలువ ఉన్నదీ నాకు తెలును. మీ రహస్యం నేను ప్రజలకు చెప్పానంటే వాళ్లు మిమ్మల్ని వదలరు. అందుచేత, మీరు ఉంచిన ధాన్యాన్ని బయటపెట్టండి. మీవద్ద ఉన్న ధాన్యం ప్రజలకు రెండేళ్లపాటు సరిపోతుంది," అన్నాడు.

ఈ విధంగా బ్రాహ్మడు బెదిరించిన వారితో నారాయణశెట్టి అనేవాడు ఒకడు. అతను మిగిలిన ధాన్య వర్తకు లతో కలిసి ఒకరాత్రి కుట్రచేశాడు. మర్నాడు వర్తకులందరూకలిసి రాజుగారి దర్బారుకు వెళ్లారు. రాజు వాళ్లను చూసి, కరువు సమస్యకు పరిష్కారం చెప్ప టానికి వస్తున్నారనుకుని చాలా సంతో షించాడు. కాని నారాయణశెట్టి కంట నీరు పెట్టుకొంటూ అన్నమాటలు విన గానే ఆయనకు గుండె జారిపోయింది

"మహారాజా! మేమంతా మరో దేశం వెళ్లిపోతున్నాం నావలు కూడా సిద్ధంచేసుకున్నాం తమవద్ద సెలవు పుచ్చుకోవటానికి ఇలా వచ్చాం," అన్నాడు నారాయణశెట్టి.

రాజు వాళ్లకు ధైర్యం చెబుతూ, "ఈ పని మీరెందుకు చేస్తున్నారు ? ఈ కరువు శాశ్వతమా ? అయినా, మీరు తిండిలేక చచ్చిపోతున్నారని నేను అను కోను. ఈ సంవత్సరం ఎలాగో తంటాలుపడితే, వచ్చే ఏడు వర్షాలు కురవటం ఖాయం. తిరిగి మీ వ్యాపా రాలు ఎప్పటిలాగే సాగుతాయి," అన్నాడు.

"అలా జరగదు, మహారాజా. ఆ బ్రాహ్మడు మాతో రూఢిగా చెబు తున్నాడు అతను వచ్చే సంవత్సరం కూడా కరువు ఉండేటట్టు చూస్తాడుట ! అతను తల్చుకుంటే అంతపనీ చేసే లాగే ఉన్నాడు," అన్నాడు నారాయణ శెట్టి.

"ఎవరా సృష్టికర్త ?" అని రాజు ఆశ్చర్యంగా అడిగాడు.

"కిందటేడు మన దేశానికి శని గ్రహంలా వచ్చిన బ్రాహ్మడే. వాడు చూడటానికి పిచ్చివాడులాగే ఉన్నాడు గాని, సామాన్యుడు కాడు. కాకపోతే ఈ కరువు గురించి ముందే ఎలా చెప్పాడు?" అన్నాడు నారాయణశెట్టి.

"మీరు పొరపాటు పడుతున్నారు ఇంత దేశానికి కరువు వచ్చేశక్తి ఒక పిచ్చి బ్రాహ్మడి కుంటుందని మీరెలా

అనుకున్నారు, మీరెవరూ దేశం విడిచి వెళ్లటానికి వీల్లేదు," అన్నాడు రాజు.

వర్తకులు వచ్చినదారే వెళ్లిపోయారు. రాజుదగ్గిర వాళ్ల ఎత్తు పారలేదు. కాని బ్రాహ్మడు వాళ్లకు ప్రాణసంకటమై కూర్చున్నాడు. అతడు తమ నిలువలను ప్రజలకు చెప్పి, తమ ప్రాణాలకు ఎసరు తీసుకురాగలడు. అతడి పీడ ముందు వదిలించుకోవాలి. అందుకు వాళ్లు మరొక ఉపాయం ఆలోచించారు.

ఆకలి బాధ ఎక్కువైనకొద్దీ జనంలో వెర్రి ఆవేశం పెరిగిపోయింది. నారాయణశెట్టి కొందరితో, రాజుతో చెప్పినట్టే, ఈ కాటకం తెప్పించిన వాడు దేవాలయంలో ఉండే బ్రాహ్మడని చెప్పారు. వాళ్లు వెర్రెత్తిపోయి, ఆ బ్రాహ్మణ్ణి పట్టుకుని చితకతన్ని, నారాయణశెట్టి ఇంటిముందరికి తెచ్చారు.

వాళ్లు ఆ బ్రాహ్మణ్ణి, "ఓరీ శని బ్రాహ్మడా ? మాకు కరువు ఎందుకు తెప్పించావు ? మమ్మల్నందర్నీ తిండి లేకుండా ఎందుకు చంపుతున్నావు ? నీ శనిని నువు తీసుకుపోతావా, పోవా ?" అని అడిగారు.

బ్రాహ్మడు వాళ్లతో "అయ్యా, మీరన్నది నిజమే. ఈ కరువు నా మూలంగానే వచ్చింది. దీన్ని తర్వాతో నేనే పోగొట్టుతాను. నాకు కాస్త వ్యవధి ఇయ్యండి," అన్నాడు.

"ఆ పని చేసేదాకా నిన్ను కదలనియ్యం," అని ఆ జనం బ్రాహ్మణ్ణి నారాయణశెట్టి ఇంటి పక్కన ఉన్న ఒక పాడుపడిన ఇంట్లో పెట్టి, తాళం వేశారు.

బ్రాహ్మడు తన పరిస్థితి గురించి తలుచుకుంటూ, కిటికీ నేల మీద పడుకున్నాడు. కొద్దిసేపట్లో ఏదో ధ్వని వినిపించింది. అది ఒక మూలనుంచి వస్తున్నది. అక్కడ ఒక కలు గున్నది. దానిలోనుంచి రెండు ఎలుకలు పైకి వచ్చి మరొక కలుగులోకి పోవటం బ్రాహ్మడికి కనిపించింది. ఆ ఎలుక నోట ధాన్యం ఉన్నది.

ఎలుకలు కలుగులోనుంచి ఎలా ధాన్యం తెస్తున్నాయి ? అవి జొరబడిన రెండో కలుగే వాటి నివాసం అయి ఉండాలి. మొదటి కలుగు ధాన్యంగల చోటికి దారిఅయి ఉండాలి. నారాయణశెట్టి ఇల్లు పక్కనే ఉన్నది. ఎలుకలు అతని ఇంటినుంచి ధాన్యం తెస్తున్నాయా ?

ఈ ఆలోచన రాగానే బ్రాహ్మడికి ఏనుగంత బలంవచ్చింది. అతను చూరు నుంచి గట్టివాసం ఒకటి విరిచి, దానితో కలుగును గబగబా తవ్వసాగాడు.

నారాయణశెట్టి ధాన్యం దాచిన చోటు ఎంతో దూరంలేదు. రెండుగంటలు

శ్రమపడి బ్రాహ్మడు అక్కడికి తాను దూరేకంత చేశాడు. తరవాత ఆయన తెల్లవార్లూ శ్రమపడి ఆ గోదామునుంచి ధాన్యంతెచ్చి, పాడుబడిన ఇంట్లో పెద్ద రాశిపోశాడు.

ఉదయం కాగానే కొందరు మనుషులు వచ్చి, "ఏం బ్రాహ్మడా, శని ఎంతదూరం వెళ్ళింది?" అని అడిగారు.

"తిండిలేని వాళ్ళను పిలవండి ప్రస్తుతానికి ఒకపూట గింజలిస్తాను", అన్నాడు బ్రాహ్మడు.

వాళ్ళు వెళ్ళి తమ వాళ్లందరికీ చెప్పారు. తరవాత ఇతరులకు తెలిసింది. ఆ రాత్రి కూడా శ్రమపడి బ్రాహ్మడు నారాయణశెట్టి గోదాం ఊడ్చేసి, తానున్న ఇంట రాశిపోసి, జనానికి తిండి గింజలు పంచసాగాడు.

ఆకలి రోదనలు నిలిచిపోయాయి.

బ్రాహ్మడు కరువును పోగొట్టుతున్నాడన్నమాట నగరమంతా వ్యాపించింది.

ధాన్యవర్తకులకు ఇది విని రెండు రకాల దిగులుపట్టుకున్నది. ఈ బ్రాహ్మడు ఇలా ధాన్యం అడిగినవారి కందరికీ ఇచ్చేస్తూంటే, తాము తమ ధాన్యాన్ని హెచ్చుధరకు అమ్మేదెలా? అసలు ఈ కాటకంలో ఈ బ్రాహ్మడికి పుట్లకొద్దీ ధాన్యం ఎక్కడినుంచి వస్తున్నది? నిజంగానే అతడి దగ్గిర అద్భుతశక్తులున్నాయా అని వాళ్లకు అనుమానం కలిగింది.

వాళ్లు బ్రాహ్మడి దగ్గిరికి వెళ్లి చాలా వినయంగా, "అయ్యా, ఈ పాడుబడ్డ కొంపలో ఉన్నట్టుండి ఇంత ధాన్యం ఎక్కడినుంచి వచ్చింది?" అని అడిగారు.

"నన్ను మీరు చావగొట్టించి ఈ కొంపలో పడేశారని తెలిసి నా మిత్రుడైన బేతాళుడు వచ్చి, జరిగిన సంగతి తెలుసుకుని, ఫలాని ఫలానివాళ్ల దగ్గిర ధాన్యం దాగి ఉన్నదని తెలిసికూడా జనానికి చెప్పనందుకు నన్ను కోప్పడి, ఎక్కడో గోదామునుంచి ధాన్యం తెచ్చి పోసిపోయాడు. కరువు ఉన్నంత కాలమూ ధాన్యం తెస్తూనే ఉంటానని మాట ఇచ్చాడు. అంతకంటె మరేమీ లేదు," అన్నాడు బ్రాహ్మడు.

బేతాళుడి పేరు వినగానే వర్తకులకు దడ పుట్టుకొచ్చింది. వాళ్లు వెంటనే తమ తమ ఇళ్లకు పరిగెత్తి తాము దాచిన ధాన్యం చూసుకున్నారు. నారాయణశెట్టి గోదాము ఖాళీ అయిఉన్నది. బేతాళుడు నారాయణశెట్టి ఇంటికి వచ్చాడని తెలియగానే మిగిలిన వర్తకులకు మరింత భయం పుట్టి, ఆ రాత్రికి రాత్రే, తాము దాచి ఉంచిన ధాన్యపు బస్తాలన్నీ పాడుబడ్డ ఇంటిముందు పేర్చిపెట్టి వెళ్లిపోయారు.

మర్నాడు బ్రాహ్మడు రాజువద్దకు వెళ్లి జరిగినదంతా ఉన్నది ఉన్నట్టు చెప్పి, ఆ ధాన్యం బస్తాలన్నీ స్వాధీనం చేసుకోమనీ, ప్రజలకు న్యాయమైన ధరకు అందించమనీ అన్నాడు.

రాజు బ్రాహ్మడికి క్షమాపణ చెప్పుకుని, మంచి బహుమానాలిచ్చాడు. వాటిని తీసుకుని ఆ బ్రాహ్మడు ఆ దేశం విడిచి వెళ్లిపోయాడు.